రాజీవ్ హత్య జరిగిన తర్వాత హరిబాబు అనే ఫోటోగ్రాఫర్ తీసిన ఫోటోల ద్వారానే హత్య ఎలా జరిగిందో , దాని వెనుక ఎవరున్నారో తెలిసింది. ఆ హరిబాబును అక్కడకు పంపినది, అనుకోకుండా అతను చనిపోవడంతో కనీసం ఆ కెమెరాను వెనక్కి సంపాదించి ఫోటోలు బయట పడకుండా వుండాలనీ శతథా ప్రయత్నించినది శుభా సుందరం అనే వ్యక్తి. అతను మద్రాసులో తన స్టూడియోలో నడిపిన క్యాంపుకి చెందిన వ్యక్తే హరిబాబు. ఇంతకీ ఎవరీ శుభాసుందరం?



మద్రాసులో ఎల్‌టిటిఇ కార్యకలాపాలకు కేంద్రమైన శుభా న్యూస్ అండ్ ఫోటో ఏజెన్సీస్ నడిపేది సుందరం. ఏజన్సీ పేరు కలిపి అతన్ని శుభాసుందరం అంటారందరూ. యువ ఫోటోగ్రాఫర్లకు పై కెదిగే అవకాశం కల్పించే వ్యక్తిగా అతను పేరుబడ్డాడు. వ్యక్తిగతంగా అతను ద్రవిడ కళగం అనే సామాజిక సంస్థ (వాళ్లు రాజకీయాల్లో వుంటారు కానీ ఎన్నికలలో పాల్గొనరు) సానుభూతిపరుడు. పెరియార్ ఇ వి రామస్వామి నాయకర్ స్థాపించిన ఈ ద్రవిడ కళగం తమిళవాదానికి, ద్రవిడనాడుకి, తమిళభాష వ్యాప్తికి కట్టుబడిన అతివాదసంస్థ. (తమిళనాడు రాజకీయాలు వ్యాసపరంపరలో వివరాలున్నాయి) వీళ్లు ఎల్‌టిటిఇకి బాహాటంగా సమర్థిస్తారు. ఎల్‌టిటిఇ తన కార్యకలాపాలు సాగించాలంటే స్థానికుల సహాయం తీసుకోక తప్పదు. ఆ సహాయం డి.కె. కార్యకర్తలు బాహాటంగా, డిఎంకె వారు లోపాయికారీగా అందిస్తూ వచ్చారు. (డికె వారికి రాజకీయపార్టీ అయిన డిఎంకె అండదండలు పుష్కలంగా వున్నాయి.) డికె వాళ్లు భారత శాంతిసేనకు వ్యతిరేకంగా, ఎల్‌టిటిఇకి అనుకూలంగా ఫోటో ఎగ్జిబిషన్లు అవీ నిర్వహిస్తూ తమిళప్రజలను ఎల్‌టిటిఇకి సానుభూతిపరులుగా మారుస్తూంటారు.

డికె సానుభూతి పరుడైన శుభ సుందరం ఎల్‌టిటిఇ సమర్థకుడిగా మారడంలో వింతేముంది? 1991 జనవరిలో ఎల్‌టిటిఇ నాయకుడు కిట్టూకి పంపిన ఒక సందేశంలో అతను "ప్రపంచవ్యాప్తంగా వున్న తమిళుల ఏకైక రక్షకుడు ప్రభాకరన్" అని అభివర్ణించాడు. దాన్ని బట్టే తెలుస్తుంది – అతని లక్ష్యం ఏమిటో. రాజీవ్ హత్యాపథకానికి వస్తున్న హంతకబృందానికి ఆశ్రయం కల్పించగల స్థానికులను రిక్రూట్ చేయడానికి అతను ముందుకు వచ్చాడు. డికె పార్టీ కార్యకర్త కొడుకు అరివు అనే అతను యితని దగ్గరకు వస్తూ పోతూ వుండేవాడు. అతనే రాజీవ్ హత్యకు కారణమైన బెల్టు బాంబును డిజైన్ చేశాడు. అతనే కాదు, రాజీవ్ హత్యతో సంబంధం వున్న అనేకమంది సుందరం వద్దకు వస్తూ పోతూండేవారు. ఒకరికి మరొకరిని పరిచయం చేయడం, పనులు పురమాయించడం.. యిలా ఈ కార్యకలాపాలకు అతను ఒక యిరుసులా, తన స్టూడియోయే ఓ శిబిరంగా పనిచేసేవాడు. అక్కడికి వచ్చే వ్యక్తుల్లో అతి ముఖ్యమైన వ్యక్తి – బేబీ సుబ్రమణియం అని పిలువబడే బాలసుబ్రహ్మణ్యం !



ఇతను ఎల్‌టిటిఇ సిద్ధాంతవేత్తల్లో ప్రముఖుడు. కాస్సేపు మాట్లాడితే ఎవరినైనా తన వైపు తిప్పుకోగల వాక్చాతుర్యం వుంది. ప్రభాకరన్‌కి సన్నిహితుడు. మద్రాసులో వచ్చి నివాసం వుంటూ ఓ ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకున్నాడు. ఎల్‌టిటిఇ సాహిత్యాన్ని ప్రచురించేవాడు. రాజీవ్ హత్య జరగాలని ప్రభాకరన్ ఆదేశించిన తర్వాత దానికి ఉపయోగపడేవారు ఎవరున్నారో కనిపెట్టి వాళ్లని కుట్రదారులుగా తయారుచేసే పని చేపట్టాడు. (హత్య జరిగిన తర్వాత జాఫ్నాకు వెళ్లిపోయాడు) శుభాసుందరం ఆఫీసుకి వస్తూపోతూ అక్కడకు వచ్చేవారిలో తనకు ఉపయోగపడేవారు ఎవరున్నారో చూసి వాళ్లను వలలోకి లాగేవాడు. అలా వలలో పడిన పెద్ద చేప భాగ్యనాథన్.

భాగ్యనాథన్ ఎవరో కాదు. ప్రస్తుతం రాజీవ్ హత్యలో పాలుపంచుకున్నందుకు జైల్లో మగ్గుతున్న నళినికి తమ్ముడు. ఈ మధ్యే ప్రియాంకా గాంధీ జైలుకి వెళ్లి నళినిని పలుకరించి వచ్చిందని వార్తల్లో చదివి వుంటారు కనుక ఆమె గురించి యిప్పటివాళ్లకు కూడా తెలిసే వుంటుంది. నళిని ఎంతటిదంటే రాజీవ్‌ను చంపడానికి మానవబాంబుగా తయారవడానికి సిద్ధపడిన వ్యక్తి. (థాను తెరమీదకు రావడంతో నళిని అవసరం పడలేదనుకోండి) ఆమె హంతకముఠాతో బాటు హత్యాస్థలానికి వెళ్లి కళ్లారా రాజీవ్ హత్య చూసి ఆనందంతో పొంగిపోయి, తిరుపతికి వెళ్లి వచ్చిన మనిషి. నళినే కాదు, ఆమె కుటుంబసభ్యులందరూ యీ హత్యలో పాలుపంచుకున్నారు.



నళిని, భాగ్యనాథన్‌ల తల్లి పద్మ. అప్పట్లో వయసు 49. ఆమె ఒక మాజీ పోలీసు ఉద్యోగి రెండో భార్య. ఇ.వి. కళ్యాణి నర్సింగ్‌హోంలో నర్సుగా పనిచేసేది. వాళ్లకు నళిని (హత్య సమయానికి వయసు 27), భాగ్యనాథన్ (వయసు 25) అని యిద్దరు పిల్లలు. నళినిని ఆమె తండ్రి చిన్నతనంలో చీటికి మాటికి కొడుతూ వుండేవాడు. దాంతో తండ్రి అంటే ఆమెకు తగని ద్వేషం. చిన్నతనం నుంచి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తపన వుండేది. స్కూల్లో ధనికుల పిల్లలతో స్నేహం చేసేది. ఒక దశలో సినిమాతార కావాలని కూడా అనుకుంది. లోయర్ మిడిల్‌క్లాసు నేపథ్యం కాబట్టి దాని నుండి బయటపడాలని తపించేది. ఎకనమిక్స్‌లో డిగ్రీ చేశాక అడయార్‌లో వుండే అనబాండ్ సిలికాన్ ప్రై లి. కంపెనీలో స్టెనో ఉద్యోగం సంపాదించుకుంది. మద్రాసు యూనివర్శిటీలో ప్రైవేటుగా పోస్ట్ గ్రాజువేషన్ చేసేది. తల్లితో తరచు గొడవపడి విడిగా వెళ్లిపోయి వుంటూవుండేది. బతిమాలి తీసుకుని వస్తూ వుండేవారు.

ఆమె తమ్ముడు భాగ్యనాథన్ చిన్నతనం నుంచే ఆకతాయిగా తిరిగేవాడు. టీచర్లు, తోటి స్టూడెంట్లు అతన్ని 'రౌడీ'గానే పరిగణించి దూరంగా వుంచేవారు. సంఘవిద్రోహులతో స్నేహం చేసే భాగ్యనాథన్ అంటే యిరుగుపొరుగుకూ గిట్టేది

కాదు. అతనికి స్నేహితులే లేరు. కాస్త పెద్దయాక అతను డికె సంస్థలో చేరాడు. పద్మకి బాగా తెలిసున్న ఫోటో జర్నలిస్టు శుభాసుందరం. రెండు మూడేళ్ల క్రితం ఫోటో ప్రింటింగ్ నేర్చుకోవడం కోసం కొడుకుని అతని దగ్గరకు పంపింది. ఓ ప్రెస్ పెట్టుకుని రాజకీయ పత్రిక నడపాలని కలలు కంటూ వుండేవాడు. కానీ దానికి కావలసిన డబ్బు మాత్రం లేదు. అప్పుల్లో మునిగి తేలుతున్నారు. తన అక్క పనిచేసే కంపెనీకి స్టేషనరీ సామగ్రి సరఫరా చేయడం ద్వారా భుక్తికి సంపాదించుకునేవాడు. అప్పటికే శుభాసుందరం కార్యాలయంలో ఎల్‌టిటిఈకి సంబంధించిన రహస్య కార్యకలాపాలు సాగుతూ వుండేవి. అక్కడే అతనికి బేబీ సుబ్రమణియం, ఫోటోగ్రాఫర్ హరిబాబు, బెల్టు బాంబు తయారుచేసిన అరివు పరిచయం అయ్యారు. వీళ్లతో బాటు ముత్తురాజా కూడా.. అతని కథ వచ్చే సోమవారం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**



**ఫోటోలు – 1. శుభా సుందరం 2. బేబీ సుబ్రమణియం 3. పద్మ 4. భాగ్యనాథన్**

.